అయ్యో.. ఇట్లు తమ విధేయులు!

ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన పాలకులు పక్కాగా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాల్సిన అధికార యంత్రాంగం ప్రజాప్రతినిధుల సేవలో తరిస్తూ అర్జీలను బుట్టదాఖలు చేస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి సోమవారం మండల రెవెన్యూ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పబ్లిక్ రిడ్రెసెల్ గ్రీవెన్స్ సిస్టం) కార్యక్రమం మొక్కుబడి తంతుగా మారిపోయింది. అధికారులు చుట్టూ తిరుగుతూ ప్రయాసపడుతున్నామే తప్ప సమస్యలకు పరిష్కారం దొరకడం లేదని అర్జీదారులు ఆవేదన చెందుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించగా.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో మొక్కుబడిగా మార్చేశారు. సమస్యలను సకాలంలో పరిష్కరించడంలో స్థానిక అధికారులు నిర్లక్ష్యం చేస్తుండటంతో ప్రజలు అర్జీలు పట్టుకుని డివిజన్, జిల్లా కేంద్రం బాటపడుతున్నారు. సోమవారం గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల్లో గ్రీవెన్స్ నిర్వహణ తీరును 'సాక్షి' పరిశీలించగా ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి.

- మొక్కుబడి తంతుగా మారిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- డుమ్మా కొడుతున్న వివిధ శాఖల అధికారులు
- అర్జీలిచ్చినా పరిష్కారం కావడం లేదని జనం ఆవేదన
- రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చిన అర్జీలకే దిక్కూమొక్కూ లేదని ఆగ్రహం

బేస్తవారిపేట: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ మొక్కుబడిగా సాగింది. రెవెన్యూ సదస్సుల అర్జీలపై రెండు రోజుల్లో జేసీ మీటింగ్ ఉందని తహసీల్దార్ జితేంద్రకుమార్ వీఆర్వోలతో సమావేశం పెట్టుకున్నారు. ఉదయం 11.30 గంటల వరకు వెలుగు సీసీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాత్రమే హాజరయ్యారు. సూపర్‌వైజర్ సంతకం పెట్టి వెళ్లిపోయారు. మిగిలిన శాఖల అధికారులు సమయపాలన పాటించకపోగా సంతకాలు పెట్టుకుని వెళ్లిపోవడం గమనార్హం. గ్రీవెన్స్‌కు 3 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.


బేస్తవారిపేటలో 11.30 గంటలకు హాజరైన వెలుగు సీసీ

■ **గిద్దలూరు రూరల్:** స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గ్రీవెన్స్ సోమవారం మధ్యాహ్నం 12 గంటలకే ముగిసింది. తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి గ్రీవెన్స్ హాల్లో కాకుండా తన కుర్చీలో కనిపించారు. కేవలం కొన్ని శాఖల అధికారులే మొక్కుబడిగా వచ్చి అంతలోనే వెనుదిరిగారు. 8 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.

■ **రాచర్ల:** రాచర్లలో గ్రీవెన్స్‌కు డిప్యూటీ తహసీల్దార్ భారతీబాయి తప్ప ఇతర అధికారులు హాజరు కాలేదు. కింది స్థాయి సిబ్బందిని పంపి చేతులు దులుపుకొన్నారు. తహసీల్దార్ సెలవులో ఉండటంతో గిద్దలూరు తహసీల్దార్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. సమస్యలు పరిష్కారం కావడం లేదని అర్జీలిచ్చినా ఉపయోగం ఏముందని రైతులు ప్రశ్నించడం గమనార్హం.

■ **కొమరోలు:** కొమరోలులో గ్రీవెన్స్‌కు అధికారులు డుమ్మా కొట్టారు. మధ్యాహ్నం 12.10 గంటల సమయంలో తహసీల్దార్ భాగ్యలక్ష్మి తప్ప ఏ అధికారీ అర్జీదారులకు అందుబాటులో లేరు. కానీ విజిటింగ్ బుక్‌లో మాత్రం ఎంపీడీఓ మస్తాన్‌వలి, ఏఓ రాజశ్రీ, హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది హాజరైనట్లుగా నమోదు చేసి ఉంది. గ్రీవెన్స్‌కు 4 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ చెప్పారు.

■ **కంభం:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్‌కు 5 శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. హాజరైన వారిలో కొందరు సంతకాలు చేసి కొంతసేపు కూర్చుని వెళ్లిపోయారు. ఉన్నతాధికారులు పర్యవేక్షించకపోవడంతో గత కొన్ని నెలలుగా ఇదే తంతు కొనసాగుతోంది. సోమవారం గ్రీవెన్స్‌లో 5 అర్జీలు వచ్చాయి.

స్పందన శూన్యం.. సమస్యలు యథాతథం

మార్కాపురం/కొనకనమిట్ల: మీ కోసం కార్యక్రమం మార్కాపురం నియోజకవర్గంలోనూ ప్రహసనంగా మారింది. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు పదే పదే అర్జీలు ఇస్తున్నారు. అధికారులు కూడా గ్రీవెన్స్‌కు మొక్కుబడిగా హాజరవుతుండటం విమర్శలకు తావిస్తోంది. సోమవారం మార్కాపురం నియోజకవర్గంలో పొదిలిలో 3 అర్జీలు, తర్లుపాడులో 2 అర్జీలు, కొనకనమిట్లలో 3 అర్జీలు, మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో 26 అర్జీలు దాఖలయ్యాయి. మండల కేంద్రాల్లో ఇచ్చిన అర్జీలు పరిష్కారం కాకపోవడంతో పలువురు వ్యయప్రయాసలకోర్చి మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వచ్చి అర్జీలు ఇస్తున్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు, భూమి హద్దులు, డీఎస్ పెండింగ్, పేరు మార్పులు తదితర సమస్యలపై కొనకనమిట్లలో ముగ్గురు రైతులు వినతి పత్రాలు అందజేశారు. గతంలో కూడా ఇవే సమస్యలపై అర్జీలిచ్చినా అధికారులు పరిష్కరించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.


కంభం తహసీల్దార్ కార్యాలయంలో సగానికిపైగా కుర్చీలు ఖాళీ

పదిహేనుసార్లు అర్జీలిచ్చా



నా స్వగ్రామం బేస్తవారిపేట మండలం పూసలపాడు. నేను విశ్రాంత సైనికోద్యోగిని. 1972లో మా పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 187లో ఎకరన్నర పొలాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే అందులో వాగు పోరంబోకు అని రాస్తూ నా పొలాన్ని దాని కిందకే చేర్చారు. నా పట్టాలో పోరంబోకు అని ఉండటంతో గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించేందుకు తరచూ ప్రయత్నిస్తున్నారు. నేను వారితో పోరాటం చేయాల్సి వస్తోంది. పట్టాను నా పేరు మీదకు మార్చాలని సుమారు 15 సార్లు అర్జీలు ఇచ్చా. పనిమాత్రం కాలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– బొల్లా బాలిరెడ్డి, మాజీ సైనికోద్యోగి, పూసలపాడు

దారి సమస్య పరిష్కరించాలి



మండల కేంద్రమైన కొనకనమిట్ల నుంచి పొలాల్లో గుండా తువ్వపాడు వెళ్లేందుకు పూర్వం నుంచి దారి ఉంది. అయితే ఆ దారిలో పోనివ్వకుండా కొంత మంది అడ్డుకుంటున్నారు. దీంతో పైఎత్తున ఉన్న పొలాలకు వెళ్లేవారు ఇబ్బందులకు గురవుతున్నారు. దారి సమస్య పరిష్కరించాలని గతంలో ఆర్డీఓ ఆదేశించినా స్థానిక అధికారులు సమస్య పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారు. ఇప్పటికైనా రికార్డులు పరిశీలించి దారి సమస్యకు ఓ పరిష్కారం చూపాలి.

– కె.కోటేశ్వరరావు, రైతు సంఘ నాయకుడు, కొనకనమిట్ల


కొమరోలులో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు పూజలు


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ తల్లి

రాచర్ల: మండలంలోని గౌతవరం గ్రామంలో పోలేరమ్మ అమ్మవారి ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకుడు ఎం.మనోహర్ శర్మ అధ్వర్యంలో పూజలు, అభిషేకం, హోమం తదితర క్రతువులు శాస్త్రోక్తంగా జరిపించారు. అమ్మవారి మూలవిగ్రహ మూర్తిని పట్టువస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ మార్తోట లక్ష్మీదేవి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సబ్సిడీపై పురుగు మందులు


పురుగు మందులు పంపిణీ చేస్తున్న ఏఓ

బేస్తవారిపేట: మండలంలోని పూసలపాడు గ్రామంలో వ్యవసాయాధికారిణి జక్కం మెర్సి ఆధ్వర్యంలో జాతీయ ఆహార, పోషకాహార భద్రతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కంది రైతులకు 50 శాతం రాయితీపై పురుగు మందులు పంపిణీ చేశారు. కంది సాగుపై రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు నవీన్, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సామాజిక తనిఖీలు


తల్లిదండ్రులతో మాట్లాడుతున్న తనిఖీ బృందం సభ్యులు

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు కేజీబీవీ, జడ్పీ పాఠశాలల్లో సామాజిక తనిఖీ బృందం సోమవారం తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల వసతులు, విద్యాకానుక తదితర రాయితీలు అందాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం, తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాన్ని పరిశీలించి అదనపు తరగతి గదుల నిర్మాణంపై ప్రిన్సిపాల్‌తో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా.. లేదా అని విద్యార్థులను ఆరా తీశారు. ఆయా పాఠశాలల్లో రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పాఠశాల నిర్వహణపై సలహాలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ మారుతీదేవి, కలుజువ్వలపాడు హెచ్ఎం సత్యనారాయణ, సామాజిక తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల కట్టడి


గిద్దలూరు పోలీసుస్టేషన్‌లో వాహనాలు పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్


కంభం సర్కిల్ కార్యాలయంలో మహిళా పోలీసులకు హెల్మెట్లు అందజేస్తున్న ఎస్పీ

గిద్దలూరు రూరల్/రాచర్ల/కంభం/కొమరోలు/అర్ధవీడు/మార్కాపురం: గ్రామాలు, పట్టణాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. చట్టం అందరికీ సమానమేనని, పోలీసులు చట్టానికి లోబడి పనిచేయాలని స్పష్టం చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా సోమవారం ఆయన గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, అర్ధవీడు, మార్కాపురం పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్లు, కంభం సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పోలీసులతోపాటు ప్రతి పౌరుడూ బాధ్యతగా ప్రవర్తించాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే సమాజంలో మంచి వాతావరణాన్ని తీసుకురాగలమన్నారు. గిద్దలూరు పోలీసు స్టేషన్ సమీపంలో శిథిలావస్థకు చేరుకున్న క్వార్టర్స్‌ను తొలగించి కాంప్లెక్స్ నిర్మించేలా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. స్టేషన్ ప్రాంగణంలో ఉన్న సీజ్ చేసిన వాహనాలను వేలం వేయాలని ఆదేశించారు. అనంతరం నంద్యాల హైవేలో పోలీసు శాఖ ఖాళీ స్థలాన్ని పరిశీలించి పెట్రోల్ బంకు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, సీసీ కెమెరాల ఏర్పాటు, సైబర్ మోసాలపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. రికార్డులు పరిశీలించి పెండింగ్ కేసుల దర్యాప్తుపై ఆరా తీశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో, మహిళ భద్రత విషయంలో రాజీ పడకుండా పనిచేయాలని చెప్పారు. స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. సచివాలయ మహిళా పోలీసులతో మాట్లాడారు. కంభంలో రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించిన అనంతరం మహిళా పోలీసులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. దాతల సహకారంతో కొమరోలు పోలీసు స్టేషన్‌ను ఆధునీకరించగా సంబంధిత శిలాఫలకాన్ని ఎస్పీ ఆవిష్కరించారు. కొమరోలు మండలంలో 100 సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొమరోలుకు త్వరలోనే ఎస్సైని నియమిస్తామన్నారు. ముందుగా పోలీస్ స్టేషన్ల ఆవరణలో మొక్కలు నాటారు. మార్కాపురం పట్టణ, రూరల్ పోలీసు స్టేషన్లను ఎస్పీ సోమవారం రాత్రి తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం సీసీ కెమెరాలను ప్రారంభించారు. నేరస్తులు, రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, సీఐలు కె.సురేష్, రామకోటయ్య, మల్లికార్జునరావు, ఎస్సైలు సుదర్శన్ యాదవ్, నరసింహారావు, రవీంద్రారెడ్డి, మార్కాపురం సీఐ సుబ్బారావు, ఎస్సైలు అంకమ్మరావు, సైదులు, రాజమోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం జన ఔషధిలో తక్కువ ధరకే మందులు

బేస్తవారిపేట: ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రంలో తక్కువ ధరకే మందులు లభించడం సంతోషదాయకమని ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో బీజేపీ నాయకుడు గోపు రమణారెడ్డి ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాన్ని ప్రారంభించారు. జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటుతో ప్రజలకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు.


జనరిక్ మందుల దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై

సరస్వతీ నమస్తుభ్యం

మార్కాపురం టౌన్: మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సోమవారం వసంత పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సరస్వతీ దేవి విగ్రహాలు, చిత్రపటాలకు అర్చకులు పూజలు చేసి విద్యార్థులను ఆశీర్వదించారు. కార్యక్రమాలను ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.


బోడపాడు ప్రాథమిక పాఠశాలలో సరస్వతీదేవిని పూజిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కాటమరాజు తిరునాళ్లకు ఏర్పాట్లు ప్రారంభం

మార్కాపురం: మార్చి 29, 30వ తేదీల్లో అతిపెద్ద జాతర అయిన కాటంరాజు తిరునాళ్లకు ఏర్పాట్లను ప్రారంభించామని జాతీయ యాదవ క్రమశిక్షణ సంఘ చైర్మన్ పిన్నిక లక్ష్మీప్రసాద్ యాదవ్ తెలిపారు. సోమవారం పెద్దారవీడు మండలం గుండంచర్ల గ్రామ పరిధిలోని ఆలయం వద్ద ఏర్పాట్లను ప్రారంభించామని తెలిపారు. వివరాలను మార్కాపురంలో ఆయన మీడియాకు తెలిపారు. సుమారు 24 లక్షల రూపాయలతో భోజనశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రెండు రాష్ట్రాలకు సంబంధించి సుమారు 2 లక్షల మంది యాదవులు తిరునాళ్లకు రావచ్చని అంచనా వేస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ వెంకట రాజు యాదవ్ తెలిపారు. పోలీసు, విద్యుత్, రెవెన్యూ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, వైద్యారోగ్యశాఖ అధికారులతో త్వరలో సమావేశమై వారి సహకారం తీసుకుంటామన్నారు. తిరునాళ్లను విజయవంతం చేసేందుకు యాదవులు సహకరించాలని కోరారు. ఇటీవలే రూ.50 లక్షలతో రోడ్ల మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జి.గంగరాజు, ఒ.నాగేశ్వరరావు, జి.సుబ్బారావు, జి.బాల నాగయ్య, బి.చిన్న వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న పీఎల్‌పీ యాదవ్ తదితరులు

ఐదు మట్టి ట్రాక్టర్లు సీజ్


సీజ్ చేసిన ట్రాక్టర్లు

గిద్దలూరు రూరల్: మండలంలోని కేఎస్ పల్లె సమీపంలో దుప్పిల తిప్ప వద్ద నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న 5 ట్రాక్టర్లను స్థానిక రెవెన్యూ అధికారులు సోమవారం సీజ్ చేశారు. అనధికారికంగా గ్రావెల్ తోలుతున్న 5 ట్రాక్టర్లను స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. పట్టుబడ్డ ట్రాక్టర్ల యజమానులు మైనింగ్ శాఖ నిబంధనల ప్రకారం జరిమానా చెల్లించిన తర్వాతే విడిచిపెడతామని డీటీ నాయబ్ స్పష్టం చేశారు.

గిద్దలూరు ఏఎంసీ యాదవులకు కేటాయించాలి

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మార్కెట్ యార్డు చైర్మన్ పదవి యాదవులకు కేటాయించాలని జిల్లా యాదవ జేఏసీ వ్యవస్థాపకుడు మిరియం శ్రీనివాసులు సోమవారం స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గిద్దలూరు నియోజకవర్గంలో అత్యధికంగా ఓటు బ్యాంకు ఉన్న యాదవులకు నామినేటెడ్ పదవులు కేటాయించాలని కోరారు. యాదవ సంఘ జేఏసీ జిల్లా అధ్యక్షుడు చిరుమామిళ్ల గోపీకృష్ణయాదవ్, బీసీ నాయకులు ఓ.వెంకటయ్య, రాజశేఖర్, పీరయ్య, రాజయ్య, కోటిలింగాచారి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భావనారుషి తిరునాళ్లు


భక్తులకు దర్శనమిస్తున్న భద్రావతి, భావనారుషి స్వామివార్లు


ఆలయం వద్దకు ఊరేగింపుగా వస్తున్న కమిటీ సభ్యులు, భక్తులు

చీమకుర్తి: పద్మశాలీయుల కుల దైవం భద్రావతి సమేత భావనారుషి స్వామి తిరునాళ్లను సోమవారం చీమకుర్తిలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజుల పాటు జరగనున్న తిరునాళ్లలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చీమకుర్తి మెయిన్‌రోడ్డులోని భద్రావతి సమేత భావనారుషి ఆలయంలోని స్వామివార్లను నూతన వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం 108 కలశాలతో గాంధీనగర్‌లోని శ్రీకోదండరామస్వామి ఆలయం నుంచి భావనారుషి ఆలయం వరకు మహిళలు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఊరేగింపుగా వచ్చారు. స్వామివారికి విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దొంతు వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి జట్ల మురళీధర్, కమిటీ నిర్వాహకులు తాటికొండ వెంకట సుబ్బారావు, వాసి వెంకటేశ్వర్లు, బండి వెంకటేశ్వర్లు, దొంతు సోమయ్య, స్థానికులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్‌జీఓ క్యాలెండర్ ఆవిష్కరణ

పొదిలి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏపీ ఎన్‌జీఓ తాలూకా యూనిట్ క్యాలెండర్ 2025ను తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఇటీవల ఉత్తమ అవార్డు పొందిన తహసీల్దార్‌ను సంఘ నాయకులు సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి సంధాని బాష, కోశాధికారి వెంకటరావు, ఉపాధ్యక్షులు కరీముల్లా, అబ్దుల్ ఆరిఫ్, సీహెచ్.వెంకటేశ్వర్లు, విజయ, సహాయ కార్యదర్శులు కళా ప్రపూర్ణ, తనూజ, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్